యు. డ్రూనినా

అలీస్క



యు. ద్రూనినా

అలీస్క

చిత్రాలు: వి. కొస్తీత్సిన్

అనువాదం: ఆర్వీయార్

"రాదుగ" ప్రచురణాలయం
మాస్కో

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

Ю. Друнина
АЛИСКА
На языке телугу

Y. DRUNINA
ALICE
In Telugu

© తెలుగు అనువాదం, చిత్రాలు "రాదుగ" ప్రచురణాలయం, 1988

సోవియట్ యూనియన్‌లో ముద్రింపబడింది

ISBN 5-05-002043-3

1944వ సంవత్సరం ఆకురాలు కాలం. సోవియట్ యూనియన్ నాజీ జర్మనీకి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్న రోజులు. అప్పుడు ఎస్తోనియా రిపబ్లిక్‌లో యీ సంఘటన జరిగింది.

నేను ఆర్టిల్లరీ రెజిమెంట్‌లో ఫీల్డ్ నర్సుగా పని చేస్తూ, ముందుకు చొచ్చుకు పోయే సైన్యాలతోబాటు ప్రయాణం చేశాను. మెడికల్ సిబ్బంది

వాన్ వెనక యెక్కణ్ణో దిగడిపోయింది. వాళ్ల కబురూ కాకరకాయీ యేమీ మాకు అందడం లేదు. నా దగ్గరున్న బేండేజీల స్టాక్ గబగబా తరిగి పోతోంది. యీ కాసిని బాండేజీలూ అయిపోతే యేం చెయ్యాలిరా నాయనా అని నాకు భయం పట్టుకుంది, యెదురు దాడిలోనేమో క్షతగాత్రులు యెప్పుడూ యెక్కువగానే వుంటారు మరి.

మేము వో చిన్న వ్యవసాయ క్షేత్రాన్ని నాజీలనుంచి తిరిగి స్వాధీనం చేసుకు న్నాం. అక్కడ్నే యిల్లూ వాకిలీ వున్న క్షేత్రం అది. అప్పుడే యింట్లోనుంచి వో ముసలావిడ నా దగ్గరికి వచ్చింది. ఆమె ఆందోళనగా వుంది. ఆమె చేతిలో మకిలిగా వున్న తెల్ల కోడిపెట్ట వొకటుంది. ఆ పెట్ట కొక్కొక్కొ మంటూ పిచ్చిగా కూస్తూనే వుంది. ఆ ముసలావిడకి రష్యన్ రాదు. కాని ఆమె అవ సరం యేమిటో మాకు అర్థమైంది. తన కోడిపెట్టకి కాలు విరిగిపోయిందట, బహుశా బాంబుల దెబ్బ తగిలే విరిగి వుండాలి.

ఆ పెట్టకి సాయం చెయ్యమని ఆమె అడగడం ధర్మమే కదా. బాధ పడ్డం మనుషులకి మాత్రమే వుండే హక్కు అని అనుకునేవాళ్ల రకం కాదు నేను.

కాని నాతో వున్న సైనికులు యేమంటారో యేమో.

నా దగ్గర బేండేజీలు తక్కువగా వున్నాయని ఆమెకి వివరించ బోయాను. కాని ఆమె కోడిపెట్టని నా చేతుల్లోకి తోస్తూనే వుంది.

యింతలో మా చుట్టూ సైనికులు కుతూహలంతో పోగయారు. ఓ నడి వయస్కుడైన సైనికుడు వున్నట్టుండి నిష్ఠూరంగా అనడం వినిపించింది:

"ఆ ప్రాణి బాధతో కొట్టు మిట్టాడుతూ వుంటే జాలీ నాలీ లేదేవిటమ్మాయ్!" అన్నాడు.

"యీా బస్తీ వోళ్లంతా అంతే. వాళ్లకి యెదటి వాళ్ల బాధ అర్థం కాదు" అని మరో పడుచు వాడు వత్తాసు పలికాడు.

యిక అక్కడ చేరిన వాళ్లంతా ముక్త కంఠంతో తిట్టడం లంకించు కున్నారు. నాది కరకు రాతి గుండె అన్చెప్పి యెన్ని మాటలన్నారో!

యిప్పటికీ వాటిని తలుచుకో బుద్ధి పుట్టదు నాకు. గాయపడిన ఆ పెట్ట పులుసులోకి బాగా వుంటుందని వో కొంటెవాడు అన్నాడు గాని అక్కడ చేరిన వాళ్లంతా ఉగ్రంగా అతనిమీద విరుచుకు పడిపోయారు. దాంతో అతను ఠక్కున నోరు మూసేసుకుని తగ్గిపోయేడు.

నేను సంచికట్టు విప్పాను. యెవళ్లో రెండు కర్రబద్దల్ని చెక్కి యిచ్చేరు. వైద్యశాస్త్రం ప్రకారం యథారీతిగా నేను కోడిపెట్ట కాలికి బద్దలు వేసి కట్టుకట్టేను.

యుద్ధ శ్రేణిలోని సైనికులు నాకా రకంగా సానుభూతి పాఠం నేర్పారు. మామూలుగా అయితే సైనికులకి సున్నిత అనుభూతులు వుండవని జనం అనుకుంటూ వుంటారు.

ఆ పాఠం నేనెప్పుడూ గుర్తుంచుకోవాలి. నాకది యిప్పుడు కూడా అలీస్క గురించి రాస్తున్న యీా సమయంలో కూడా, గుర్తు వుంది.

ఆ సుదూర యుద్ధ సమయపు ఆకురాలు కాలం నేను మర్చి పోగలనా. భుజంమీద రెడ్ క్రాస్ పట్టీ సంచీ తగిలించుకుని చేతుల్లో గిలగిల లాడే కోడిపెట్టని పట్టుకుని వున్న వంకర కాళ్ల అమ్మాయిని నేనప్పుడు.

ఓ రోజున మా పదిహేనేళ్ల అమ్మాయి అల్యోనా "అమ్ముడు పోవ డానికి ప్రయత్నిస్తూ వున్న" కుక్క గురించి చెప్పింది.

ఆ చిత్రమైన జీవిని అల్యోనా మాస్కోలో "పక్షుల బజారు" అనే

చోట చూసిందట. అల్యోనా ప్రతి ఆదివారం అక్కడికి వెడుతూ వుండేది. అక్కడ పకుల్నే కాక అన్ని రకాల పెంపుడు జంతువుల్నీ అమ్ముతారు. చేపలేమిటి, గినీ పిగ్‌లేమిటి, కుక్కలేమిటి అన్నిట్నీ...

*

కుక్కల్ని అమ్మేవాళ్లు నిడుపాటి రాతి గోడ వారనే నుంచున్నారు. ఆ కొత్త వాతావరణం చూసీ, తమకి మోసం జరిగిపోతుందనే అనుమానం తోచీ అక్కడున్న కుక్కలు అటు వెళ్లే వాళ్లకేసి మొరుగుతూనే వున్నాయి. నిజానికి యజమానులే రహస్యంగా వాటిని మొరగమని పురిపెడుతున్నారేమో కూడానూ. గుర్రాలు చురుకైనవిగా కనిపించేటట్టు చెయ్యడానికి వాటిని జిప్సీలు పీడిస్తారట. ఆ మాదిరిగానే కుక్కల యజమానులూ చేస్తూ వుండచ్చు. యెంతయినా జనం కుక్కల్ని కొనేది యిళ్లని కాపలా కాయ డానికి కదా. కుక్క యెంత క్రూరమైందైతే అంత ధర పలుకుతుంది మరి.

ఆవరణ గోడవారనే నిశ్శబ్దంగా వొక వొంటరి అల్సేషియన్ కుక్క కూచుంది. వొట్టి యెముకల గూడులా, ఆలనా పాలనా లేక వికారంగా తయారైన దానిలా వుంది. అమ్ముడు పోయిన కుక్క వొక్కొక్కటే కొత్త యజమానితో వెళ్లిపోతూ వున్నప్పుడల్లా దానికేసే అసూయగా చూస్తూ వుంది యిది. దీనంగా వున్న యీ అల్సేషియన్ కుక్క కళ్లు, అది బెరుగ్గా ఆడించే తోక, మొత్తం దాని కలవర పడిన వాలకం "నన్ను కూడా తీసికెళ్లరూ, నన్ను కూడా" అని అడుగుతున్నట్టు, కాదు, విలపిస్తున్నట్టు వున్నాయి.

కాని వూరికే వొచ్చే వస్తువులంటే యెవళ్లకీ ఆసక్తి వుండదు. తనని తను అమ్ముకుంటున్న కుక్కని, లేదా వూరికే అర్పించేసుకుంటున్న కుక్కని చూస్తే వింతగానే వుంటుంది, యింకా చెప్తే అనుమానం కూడా కలు

గుతుంది. చూడ్డానికేమో యిది అల్సేషియన్ కుక్కే, కాని నిజానికి దీని వంశావళి యేమిటో యెవళ్లకీ తెలీదు.

వరసగా మూడు ఆదివారాలు అది మార్కెట్లో అదే చోట అల్యోనాకి కనిపించింది. కనిపించిన ప్రతి సారి అది యింకా దీనంగా వుంది. దాని బొమికలు యింకా పైకి పొడుచుకు వచ్చేయి.

యీ కథ విన్నాక దాని జాతీ గీతీ యేమిటీ అని చూడకుండా దాన్ని పెంచుకుందామని నిర్ణయించుకున్నాం — అది శుద్ధ సంకర జాతి కుక్క అయినా గానీ.

ఆ తర్వాతి ఆదివారం నాడు అక్కడికి వెళ్లేం. జంతువులూ మనుషులూ రద్దీగా వున్న ఆ గుంపులో దారి చేసుకుంటూ వెళ్లేం. మనుషుల గొంతుకలు, కుక్కల అరుపులు, పక్షులు కూతలు — అబ్బబ్బ, చెప్పలేనంత గోలగోలగా వుందక్కడ. నాకు తల దిమ్మెత్తిపోయింది.

వున్నట్టుండి, మెళ్లకి కట్టిన తాళ్లని గుంజుకుంటూ వున్న ఆ బొంగురు కుక్కల మధ్యలో నాకో వింత జంతువు కనిపించింది. అది మంచుమీద కూర్చుంది. విపరీతంగా బెదిరిపోయినట్టు కనిపించింది. పిల్లి అంత వుంది. దాని చర్మం యిసిక రంగులో వుంది. దానికి మిలమిల మెరిసే పెద్ద పసుపు పచ్చ కళ్లు వున్నాయి. దాని శరీరం బిగిసినట్టుగా వుంది. తోక మంచి బొచ్చుతో వుంది. కాళ్లు సన్నగా వున్నాయి. వెనక కాళ్లు దొడ్డి కాళ్లు, 'X' ఆకారంలో వున్నాయి.

దాని మెడకి నాటు పట్టీ వుంది. దానికి వో గొలుసు తగిలించి వుంది. బెదురు గొడ్డు చూపుల కుర్రాడొకడు ఆ గొలుసుని పట్టుకున్నాడు. బహుశా ఆ కుర్రాడు దాన్ని యింటికి తీసికెళ్లి వుంటాడు. కాని తల్లీదండ్రీ తిట్టిపోసి

వుంటారు. యీ పనికి మాలిన పెంపుడు జంతువుని యెలాగో అలాగ అమ్మి తగలెయ్యమని ఆ కుర్రాణ్ణి యింట్లోనుంచి తరిమి వుంటారు.

నేను దాని పక్కన చేరి జాగ్రత్తగా దాన్ని నిమరడం మొదలెట్టాను. అది చెవుల్ని అప్పళించుకుంది.

"జాగ్రత్తండీ, కరుస్తుంది" అని కుర్రాడు హెచ్చరించాడు. కాని నేను దాన్ని అప్పటికే చేతుల్లోకి తీసుకున్నాను. దాని గుండె దడదడ కొట్టు కుంటోంది. మొత్తం దాని వొళ్ళు మెలికలు తిరిగిపోతూ వొణుకుతోంది. ఆశ్చర్యమేముంది! పాపమా అడివి జంతువుకి చుట్టూతా భయం కలిగించే వాతావరణం వుందాయిరి!

నిజానికి అది అడివి జంతువు అని నేను ఫీల్ కాలేదు. అంత దీనంగా, బెదిరిపోయి వుందది. పైగా అది పిల్ల అని నేననుకున్నాను. తర్వాత యెప్పుడో తెలిసింది నాకు అది వయసుకి చిన్నదే అయినా పూర్తిగా యెదిగిన షచ్చిక బీటి గుంట నక్క అని, దాన్ని కోర్సక్ అంటారని.

ఎన్సైక్లోపీడియాలో కోర్సక్‌ల గురించి యిలా రాశారు: "కోర్సక్ మామూలు గుంట నక్కలాగే వుంటుంది. కాని కొంచెం చిన్నగా వుంటుంది (శరీరం పొడవు 50–60 సెంటీమీటర్లు, తోక 25–35 సెంటీ మీటర్లు). ఆసియాలోనూ, ఆగ్నేయ యూరప్‌లోనూ వున్న యెడారి ప్రాం తాల్లో, అర్ధ యెడారుల్లో వుంటుంది. సోవియట్ యూనియన్లో యిది ఉత్తర కాకసస్‌నుంచి ట్రాన్స్ బైకాలియా దాకా 50° ఉత్తర అక్షాంశం దాకా కూడా వుండే ప్రాంతంలో కనిపిస్తుంది. యిది చాలా ఉపయోగకర మైన జంతువు. యేమంటే చుంచుల్లాంటి వాటిని మట్టుపెడుతుంది."

యింతటి లాభదాయకమైన పని చేస్తుందుకు మనుషులు చూపించే

కృతజ్ఞత యేమిటయ్యా అంటే వాటిని, కోర్సక్‌లని, మట్టుపెట్టేయ్యడం! యెందుకంటే ఎన్‌సైక్లోపీడియాలో వుంది "అవి అద్భుతమైన బొచ్చుకి పని కొస్తాయి" అని.

...సరే యేమైతేనేం మొత్తంమీద కోర్సక్‌ని సొంతం చేసుకున్నాను. యీ లోపున ఆ బెదురు గొడ్డు కుర్రాడు వో పది నోటు జేబులో పెట్టు కుంటున్నాడు. (ధరేం అంత యెక్కువ కాదు చూస్తే!)

నాకు రాబోయే చిక్కులేమిటో నాకు తెలుసు. చిక్కులంటే పెంపకానికీ పోషణకీ సంబంధించినవే అని కాదు నా ఉద్దేశం. అడివి జంతువుని నాగ రిక ప్రపంచంలోకి తెచ్చినప్పుడు చిక్కులు విధిగా వస్తాయి, యెక్కువ అవుతాయి. వాటిని బోనులో వుంచి బంధించ దలచుకుంటే తప్పు. రాత్రి పగలూ వొక్కలా వాటిని కనిపెట్టి వుండాల్సిన తీవ్రమైన బాధ్యతా భావమూ మాత్రమే కాదు. "మీ స్నేహితుల పట్ల మీరు బాధ్యులై వున్నారు..." అని చెప్పినప్పటికీ.

అసలు దారుణం యేమిటంటే అడివి జంతువులతో మన సంబంధాలు యెప్పుడూ విషాదాంతంగానే ముగుస్తాయి. మచ్చిక కాని ఆ లోకం తన నియమాలని ఉల్లంఘించిన వాళ్ళమీద కసి తీర్చుకుంటుంది.

యీ జంతువుని యేమని పిలవాల్సిందీ, అది యెక్కణ్నుంచి వచ్చిందీ, దాని ఆహారం యేమిటైందీ ఆ కుర్రాణ్ణి అడుగుదామనుకున్నాను. యేమంటే దానికి చుంచుల్లాంటి వాటిని తెచ్చి తిండి పెట్టలేను కదా. సరిగ్గా యింత ట్లోకీ మా అల్యోనా మేం బజారుకి యెందుకొచ్చామో ఆ కుక్కతో కలిసి సుడి గాలిలా దూసుకువచ్చింది. చిత్రం! అది నిజంగా అల్సేషియనే! అది దీనంగా, దిక్కు మాలిన జీవిలా చూస్తోంది. మొత్తంమీద యెలాగైతేనేం

తనకో "కొనుగోలుదారు" దొరకడంతో అది మా అమ్మాయి కొంగుకి ముడి పడిపోయినట్టుగా వచ్చింది. అక్కణ్ణే దానికి వినీత, ముద్దుగా వినీ, అని పేరు పెట్టేశాం. గుంట నక్కకి అలీస్క అనే పేరు పెట్టాం.

యింతట్లోకీ అలీస్కని తెచ్చి అమ్మిన కుర్రాడు ఐపు లేకుండా మాయమైపోయాడు.

దాంతో అది యెలా మాస్కోకి వచ్చిందో తెలుసుకోలేకపోయాం. యేదో అజ్ఞాత దేశాలనుంచి, సగం మరిచిపోయిన బాల్య గాథల కల్పనలనుంచి వచ్చి వుంటుందని యెవళ్లో వూహ చేశారు.

నేను వొణుకుతూ వున్న అలీస్కని చేత్తో పట్టుకుని గుంపులో దారి చేసుకుంటూ నడిచాను. ప్రతి వాళ్లూ మాకేసే తేరిపార చూశారు. ఓ చిన్న పిల్ల పీడలా పట్టుకుని నన్ను వదలకుండా నా వెనకాలే పరిగెత్తు కుంటూ వస్తూ "యెందుకు కొన్నారమ్మా దీన్ని? బొచ్చు కాలర్ కోసమా" అని అడుగుతూనే వుంది.

*

మా అమ్మాయి కోడికాలుని వంట పాత్రలు పెట్టుకునే బీరువాకిందికి తోసింది. అలీస్క తిండి అలవాట్లు యేమిటో మాకు తెలియదు, కాని శాకాహారి కాదని మాత్రం మాకు నమ్మకమే.

కొంచెం సేపట్లోనే మాకు కరకరమని యెముకల్ని నములుతూ వుండడం వినిపించింది. మా అమ్మాయి బీరువాకిందికి తొంగి చూసింది. కరకర చప్పుడు దగ్గులాంటి ధ్వనిగా మారింది. అలీస్కకి బొమిక అడ్డం పడి పొలమారిందేమోనని భయపడ్డాం. కాని వో మాదిరి కోపాన్ని కోర్సక్ వెల్లడి చేసే తీరు అలాంటి దగ్గు అని మాకు త్వరలోనే తెలిసింది.

అలీస్కా తన కోపాన్ని వెల్లడి చేసే యింకో ధోరణి కూడా చూపించింది. యేదేనా పిల్లి కలవర పడిపోయి, దిక్కు తోచకుండా గదిలో దూరితే గనక అడివి జంతువు వాసన దాన్ని బెదర గొట్టేస్తుంది.

అలీస్కా బీరువా కిందనుంచి దూసుకుంటూ వచ్చి తారస్థాయిలో కుక్క పిల్ల మొరిగినట్టు మొరిగింది. అది కోపానికి పరాకాష్ట అట, మాకు తర్వాత తెలిసింది.

పిల్లి తనుకూడా వొంటెకి మల్లే వీపు వొంచేసింది. యెదురు తిరిగింది. అది కోపంతో, ఉగ్రంగా బుస్సుమంటోంది. నేను దాన్ని యెత్తి అక్కణ్ణుంచి బయటికి తీసుకుపోయాను.

అలీస్కాని చూపించడానికి వినీని తీసుకు వొచ్చినప్పుడూ అలీస్కా యిలాంటి మర్యాదే చూపించింది. బజారునుంచి యింటికి తీసుకువచ్చేటప్పుడు యీ రెండూ బాగా ఉద్రేక పడి వుండడం వల్ల వొక దాని గురించి వొకటి పట్టించుకోలేదు. కాని యింటి దగ్గర యధేచ్ఛగా విహరించే పూర్తి స్వాతంత్ర్యం రావడం వల్లా యిక్కడి భౌగోళిక పరిస్థితిని పరిశోధించడంవల్లా అలీస్కాకి యిది రాజ్యమే ననిపించింది. పిచ్చిగా తనకేసి మొరిగే యీ మట్టూ మర్యాదాలేని జీవిని సాధువైన వినీ ఆశ్చర్యంగా గుడ్లప్పగించి చూసింది. తను తలుచుకుంటే వొక్క పంజాతో దాన్ని తపామని పించెయ్య గలదు మరి. దాంతో వాటి పరిచయ సమావేశం రసాభాస అయిపోయింది. మేం కుక్కని అక్కణ్ణుంచి తీసికెళ్లిపోవాల్సి వచ్చింది.

శత్రువుల పథకాలని వమ్ము చేసేశాక ఆ "విజేత" ప్రతి కుర్చీనీ, ప్రతి టేబిల్ కాలునీ, ఫర్నిచర్ సామాన్లనీ వాసన పట్టడం మొదలు పెట్టింది. తర్వాత కిటికీ పక్కనే వున్న చేతుల కుర్చీమీదకి గెంతి తీనెమీదకి

అనుకుని మహా ఆసక్తిగా మంచు కప్పిన మాస్కో పెరట్లోకి తేరి చూస్తూ వుండిపోయింది. ఆ తర్వాత అది యీ బాపతు విన్యాసాన్ని చాలా సార్లు చేసింది. కిటికీ దాటితే కావలసినంత స్వేచ్ఛ.

వో పింగాణీ సాసర్లో మాంసం కట్టు పోసి అలీస్క ముందు పెట్టాను. అది దాన్ని వాసన చూసి, తన తిరస్కారాన్ని బహుస్పష్టంగా వెల్లడి చేసింది: సాసరుమీద కూర్చుని స్త్రరున వొంటేలు కానిచ్చేసింది. మేం దిమ్మెర పోయాం. యిదేనా టేబిల్ దగ్గర చూపించే మర్యాద!

గుంట నక్కలు యీ విధంగా తమ తిండి సామాను దాచేసి వాసనకి గుర్తుగా వుండేట్టు చేసుకుంటాయని నాకు తర్వాత తెలిసింది. కాన్నైతే మొదట దాన్ని నేలలో కప్పెడతాయట. యిక్కడ మట్టి లేకపోవడంతో అలీస్క తన తిండిమీద అలా కూర్చుంది. అది దాని సహజ గుణం.

మరో పక్క అలీస్క ఆశ్చర్యకరమైన తన కొంటెతనంతో యీ మాదిరిగా చేస్తోందనీ నాకు అనుమానం తగిలింది. అది యెక్కువ సార్లు యీ "మూత్ర విసర్జన పాత్ర" నాటకం ఆడేది, కాని పెట్టిన తిండి తనకి నచ్చనప్పుడే.

రాత్రిపూట అలీస్క భలే సరదాగా వుండేది. గదిలో ఉడత మాదిరీ గెంతేసేది. కుర్చీలమీదకి, అక్కణ్ణుంచి నేలమీదకి ఉరుకుతూ వుండేది. గుంట నక్కలు నిశాచరులే ననుకోండి. కాని మనం నిశాచరులం కాదుగా, అంచేత రాత్రిళ్లప్పుడు దాన్ని బాత్ రూమ్లో పెట్టి గడియ వేసేద్దామని అనుకున్నాం. కాని చెయ్యడం కంటే చెప్పడం సులభం కదా.

రోజంతా భోజనాల గదిలోకి వెళ్లేటప్పుడు వచ్చేటప్పుడు గబగబా వొక్క ఉదుట్న తలుపు మూసేస్తూ వుండేవాళ్లం. లేకపోతే యీ చురుకైన

గుంట నక్క హాల్లోకీ, అక్కణ్ణుంచి గదిలోకీ వచ్చి పడిపోతుందని భయం. 'జూ' వాసన కొట్టడానికి వొక్క గది చాల్లెమ్మని అనుకున్నాం.

కాని మొత్తం వాటా భాగం అంతా 'జూ' వాసన వ్యాపింపచెయ్యాలనే అలీస్క మంకుగా వున్నట్టుంది. నిజమైన నక్క జిత్తులతో పట్టు సడల కుండా పుట్టెడు వూహతో అలా చెయ్యాలని మళ్ళీ మళ్ళీ ప్రయత్నించింది.

అయినా గానీ భోజనాల గది తలుపు యివతలికి తెరిచి వుంచినా బయ టికి వచ్చేది కాదు.

నేను వో దారానికి మాంసం ముక్కని కట్టి, పిల్లితో ఆడుతున్నట్టుగా అలీస్కతో ఆడుతూ దాన్ని హాల్లోకి రప్పించేందుకు ప్రయత్నం చేశాను. అలీస్క రావడమైతే హాల్లోకి వచ్చేది, కాని యెవళ్ళేనా భోజనాల గది తలుపు ముయ్య బోయారో టక్కని వాళ్లని దాటుకుంటూ దూసుకుపోయి మళ్ళీ చేతికి చిక్కేది కాదు. "నాజూకైన" కోసు కళ్ళు మిలమిల మెరుస్తూ వుంటే నోరు వెడల్పుగా చాచి యికిలిస్తూ మహా సంబరపడిపోయి, ఉల్లా సంగా మమ్మల్ని నిజంగా ఆట పట్టించేది.

ఆ రకంగా తెల్లవారకట్ల రెండు గంటల దాకా మాకు అలీస్కతో యీ "సరదా" వుండేది. యింట్లో వాళ్లం అందరం కలిసి వో చిక్కు పరి కరాన్ని తయారుచేశాం. దీనికి వో తాడు వుంటుంది. ఆ తాటి కొస వొకటి అల్యోనా చేతిలో వుంటుంది, యింకో కొస తలుపు హేండిల్‌కి కట్టి వుంటుంది. మొదట దీనివల్లా పని జరగలేదు. తలుపు మూసుకునేటట్టు అల్యోనా తాడు లాక్కునే ముందే అలీస్క లోపలికి దూరేసేది. చచ్చీ చెడి మొత్తా నికి యీ పథకం పారింది. బహుశా అలీస్కకి యీ ఆటలో విసుగొచ్చి వుంటుంది. యెలాగైతేనేం అలీస్కని బాత్ రూమ్‌లో ప్రవేశపెట్టాం.

నాకు యీ సాహస కృత్యంతో ఉద్రేకం యెక్కువైపోయి నిద్రపట్టింది కాదు. నిద్ర మాత్ర వేసుకున్నాను.

కునుకు పడుతోంది, ధనామని యేదో విరిగి పడిన చప్పుడు అయింది.

నేను వొక్క ఉదుట్న లేచి బాత్ రూమ్‌లోకి పరిగెత్తేను. ఆ దృశ్యం నేను వూహించలేదు, మతిపోయింది. అలీస్కా వాష్ బేసిన్‌లో వెనక కాళ్లమీద నుంచుని అద్దం పలకమీద వున్న ప్రతి వస్తువునీ, — టూత్ బ్రష్‌లు పెట్టిన గ్లాసుని, పళ్లపొడి డబ్బాని, సబ్బుని, షాంపూని, ఉడికలోన్ సీసాని, క్రీమ్ జార్‌ని — ముందు కాళ్ల పంజాలతో కిందికి తోసేస్తూ వుంది. అవి వొకొక్కటే వాష్ బేసిన్‌లోకో, కింద నేలమీదకో పడిపోతూనే వున్నాయి. అన్నీ ముక్కలు ముక్కలుగా పగిలిపోయాయి. వాటిలో వుండే సరుకులు వొలికిపోయేవి వొలికిపోయాయి, చెదిరిపడేవి చెదిరిపడ్డాయి.

గుంట నక్క తాపీగా నాకేసి ముఖం తిప్పింది. దాని మూతినిండా పళ్లపొడి అంటుకుపోయింది. అది మళ్లీ నోరు యికిలిస్తూ పెట్టింది.

యీ సంతంతా తుడిచి శుభ్రం చేశాను. బాత్ రూమ్‌లోనుంచి తీసెయ్యగల వాటినన్నిటినీ అక్కణ్ణుంచి తీసేసి మరో రెండు నిద్ర మాత్రలు వేసుకుని నిద్రపోయాను. అలీస్కా అల్లరి చెయ్యగల వస్తువులేవీ యిక బాత్ రూమ్‌లో లేవు కదా అని హాయిగా అనుకుని మరీ నిద్రపోయాను.

రాత! నా హాయి, నిద్ర రెండూ క్షణికమే అయ్యాయి. గుంట నక్క కుయుక్తుల్ని నేను తక్కువ అంచనా వేశాను.

వింత గోకుడు చప్పుడు అయి నాకు మెలకువ వచ్చేసింది. యీ నక్క కాదు గాని పాడు అని తిట్టుకుంటూ లేచాను. వెళ్లి చూస్తును కదా అది స్నానాల తొట్టిలో, పిల్లలు మంచుమీద పైనుంచి కిందికి జారినట్టుగా,

జారుతోంది. యీ విశేషమైన "బిడ్డ", బహుశా జారేటప్పుడు బ్రేక్‌లా వుండాలనేమో, పంజాలతో అనుకుంటూ అలా చేస్తోంది. అదీ నా మెల కువకి కారణమైన గోకుడు చప్పుడు.

యిక రాత్రి అయితే తెల్లవార్లూ అలీస్కా యీ జారుడు బండి ఆట ఆడుకుంటూనే వుంటుందనేది తేలిపోయింది. లేకపోతే తనే మరో వినోదం సృష్టించుకుంటుంది...

*

అలీస్కా మా యింటికి వచ్చిన రెండ్రోజులకి దానికి వొంట్లో బాగా లేదని గమనించేను. అది పరుపుమీద పడుకోకుండా (మరీ వేడిగా వుందేమో!) చల్లగా వున్న పలకలమీద పక్కవాటుగా వాలి మెల్లిగా మూలగడం మొద లెట్టింది. దాని శ్వాస వేడిగా వుంది, ముక్కు పొడారిపోయి వెచ్చగా వుంది.

యేమయిందోనని చెప్పి దాన్ని పశువుల డాక్టరు దగ్గరికి తీసికెళ్లాను. చూడండి బాబూ, అక్కడ అందరి కళ్లూ దీనిమీదేలగ్నమైపోయాయి. అద్భుతమైన బూడిద రంగు పొడల పెద్దకుక్క అక్కడ వుంది. అదంటే కూడా అక్కడున్న వాళ్లకి ఆసక్తి లేకపోయింది, అందరూ దీని కేసే చూశారు.

అంత దివ్యంగా తన ప్రభ వెలిగిపోతూ వున్నా అలీస్కా పట్టించు కోలేదు. నిజంగా దానికి వొంట్లో బాగా లేదు. మాకు క్యూలో వుండక్క ర్లేదని మినహాయింపు యిచ్చేరు. కన్నీటి చారికలు కట్టిన ముసలమ్మ వొకావిడ సర్జన్ గదిలోనుంచి ఆల్కహాల్‌కి మల్లే వలేరిన్‌కి అలవాటు పడిన పిల్లిని తీసుకుని యివతలికి వచ్చింది. వలేరిన్ అరకు ఫ్లాస్క్ మూత గొంతుక్కి అడ్డం పడి ఆ పిల్లి ఉక్కిరిబిక్కిరి అయిపోయిందట. ఆమె యివతలికి రాగానే నేను లోపలికి వెళ్లేను.

మొదటగా వాళ్లు వొణికిపోతూ వున్న యీ రోగి తోక కింద థెర్మా మీటర్ పెట్టారు. దాని టెంపరేచర్ 44.5 సెంటీగ్రేడ్ వుంది. మామూలుగా మనుషుల శరీరోష్ణోగ్రత కంటే యెక్కువ శరీరోష్ణోగ్రత వుండే జంతువులకి కూడా యీ టెంపరేచర్ చాలా యెక్కువే.

డాక్టరు అలీస్కాని మొత్తం తట్టి చూసి దానికి "మెంబ్రేనస్ న్యూమోనియా" వచ్చిందని చెప్పాడు.

అలీస్కాకి బజార్లో వున్నప్పుడు జలుబు చేసి వుండాలి. చాలా సేపు కదలకుండా మంచుమీదనే కూర్చుని, ఆందోళనతో నోరు తెరుచుకు తేమగాలి పీల్చడంతో జలుబు చేసి వుంటుంది.

"దీనికి బాగా జబ్బుగా వుంది. కాని ఇంజెక్షన్‌కి అడివి జంతువు అదిరిపోతుంది. మాత్రలే యిచ్చి చూద్దాం. దీని పేరేమిటి?" అని డాక్టరు అడిగేడు.

"అలీస్కా."

"యింటి పేరు."

"యేమిటి మీ ఉద్దేశం?" అని అడిగాను.

"మీ యింటి పేరు" అన్నాడు డాక్టరు చిరాగ్గా.

చెప్పాను. డాక్టరు యేదో ప్రిస్క్రిప్షన్ రాసి యిచ్చేడు. ఇంటికి వచ్చే దారిలో మందుల షాపులోకి వెళ్లి ప్రిస్క్రిప్షన్ కాగితం విప్పి చూసేను: "అలీస్కా ద్రూనినా, ఆడ గుంట నక్క!" యిక తర్వాత సమస్య అలీస్కా చేత మందు యెలా మింగించడమా అని. రోజుకి మూడు సార్లు గుంట నక్కని జిత్తులు చేసి వోడించడం నిజంగా యజ్ఞమే.

పచ్చి కార్జం ముక్కకి లోగంటు చేసి యీ మాత్రలని అందులో

పెట్టాను. మొదటి సారి పని జరిగింది. అలీస్క కార్జాన్ని మాత్రలతో బాటుగా మింగేసింది. మింగిం తర్వాత అది ముఖం వికారంగా, చీదరించు కుంటున్నట్టుగా పెట్టింది. "లోపల యేమిటీ చేదు సరుకు చెత్త" అంటున్నట్టు కనిపించింది.

రెండవ సారి అలీస్క కార్జం తినేసి మాత్రల్ని వదిలేసింది.

మూడవ సారి మొత్తం వదిలేసింది.

మళ్లీ పక్కకి వొరిగి, అల్లరి చెయ్యాని బుద్ధి మంతుడైన పిల్లాడిలాగా మెల్లిగా మూలుగుతూ, బొచ్చుతో గుబురుగా వున్న తోకని కాళ్ల మధ్య పెట్టుకుని పడుకుంది. ఆరు నూరైనా నూరు ఆరైనా అలీస్క చేత మాత్రల్ని మింగించడం అసాధ్యం అని తేలిపోయింది. మందు తీసుకోకపోతే అది చచ్చిపోతుంది. మళ్లీ దాన్ని పశువుల డాక్టరి దగ్గరికి తీసికెళ్లాను.

"వుఁ యింక చేసేదేం లేదు. యేదైతే అది అవుతుంది, ఇంజక్షనే యిచ్చి చూద్దాం" అన్నాడు.

నర్సు అలీస్క వెనక కాలు సాగదీసి పట్టుకుంది. డాక్టరు దబ్బనం లాంటి బండ సూది వున్న సిరెంజి తీసాడు... నేను నోరు వెళ్లబెట్టి చూస్తు న్నాను: షాక్ తగల్దు కదా? పాపం యెంతైనా అలీస్క మచ్చిక అవని జంతువు కదా! కాని యే యిబ్బందీ లేకుండానే జరిగిపోయింది.

అలీస్క కోలుకుంటోంది. కాని రోజుకి మూడు ఇంజెక్షన్లు యివ్వాల్సి వుందట రోజుకి మూడు సార్లు డాక్టరు దగ్గరికి దాన్ని తీసికెళ్లే తీరిక నాకు లేకపోయింది. అప్పుడు మా ఆయన వొక వీరోచితమైన నిర్ణయం తీసుకున్నారు. ఆయన జన్మలో యెన్నడూ సిరంజి చేత్తో పట్టుకుని యెర గరు, తనే అలీస్కకి ఇంజక్షను యిస్తానని అన్నారు.

యేం జరుగుతుందా అని జాగ్రత్త పడుతూ, అనుమానంగా చూసే అలీస్కని వొళ్లో పట్టుకుని కూర్చున్నాను. మా ఆయన సిరెంజ్ నింపి, దాని వెనక కాలిని మెల్లిగా వెనక్కి లాగి, అక్కడ ఆయొడీన్ పూసి, నిబ్బరంగా సూదిని లోపలికి గుచ్చేరు. అలీస్క కంపించిపోయి, తనని వెనకనుంచి యెవరు దుర్మార్గంగా కరిచారా అని చూడబోయింది. కాని సిరెంజి పిస్టన్ గట్టిగా నొక్కినా ముందుకు వెళ్లలా, సూదికి యేదో అడ్డం తగిలి వుండాలి. అనుభవంలేని మా మెడికోగారు ముఖం చిట్లించుకుని దాన్ని యివతలికి లాగేరు. మళ్లీ దాని కాలు యధాస్థానంలో వుంచేరు. అప్పుడు చూశాను! నా కుడి చెయ్యి అలీస్క నోట్లో వుంది! మా ఆయన మరో సారి ఇంజక్షన్ చెయ్యాల్సి వచ్చింది. అలీస్క గొలుసుని కొరకడం గుర్తువచ్చి కళ్లు మూసుకున్నాను. తనని పీడించేవాళ్లని అది కరవదా మరి? తన బాగు కోరే మేం తనకి నొప్పి కలిగిస్తున్నామని దానికెలా తెలుస్తుంది?

కాని సరిగ్గా ఆ విషయమే దానికి యేదో సహజ ప్రేరణ వల్ల తట్టి వుండాలి. లేదా నేనంటే చెప్పలేనంత నమ్మకమేనా వుండి వుండాలి. యేమైనా మా ఆయన ఇంజక్షన్ చేసేటప్పుడు కొంచెం పళ్లు బిగపట్టుకుంది, అంతే.

యిక అది ఉరుకులు పరుగులుమీద కోలుకోవడం మొదలెట్టింది. కోలుకుంటోందని చెప్పడానికి చాలా నిదర్శనాలు వున్నాయి, కాని అనుమానానికి తావు లేకుండా వుండే నిదర్శనం వొకటుంది. అది మళ్లీ యధాప్రకారం కొంటె చేష్టలు మొదలుపెట్టింది. మొదటి కొంటె పనితోనే మాకు అది కోలుకుందన్న పూర్తిధైర్యం చిక్కింది.

పక్షి బజార్లో భయంతో, చలికి గబగబ వొణికిపోతూ వుండే దీనమైన యీ చిన్న జంతువు అలీస్క, మా యింటి ఆరాధ్యంగా, కుటుంబం అంతా

కొలిచే ప్రతిమగా తయారవడానికి యెంతో కాలం పట్టలేదు.

దాని అభిమానం సంపాదించడానికి మేము వొకళ్లతో వొకళ్లం పోటీ పడ్డాం. నేనంటేనే దానికి బాగా యిష్టం అవడం నాకు చాలా చెప్పలేనంత గొప్పగా అనిపించింది.

అది నన్ను మాత్రమే తనని లేవనెత్త నిచ్చేది. అప్పుడు కూడా మొదటి కొన్ని క్షణాలూ అది వొణికేది, చెవులు అప్పళించుకునేది. మనుషుల్తో సంబంధం కలిగించు కోవడమనే అనుభూతితో దాని అడివి జంతువు సహజ ప్రవృత్తి సంఘర్షించేదేమో.

చేత్తో దానికి తిండి అందించే ధైర్యం గల వ్యక్తి నేను మాత్రమే. అది యెప్పుడూ నేను చిన్న చిన్న ముక్కలు మెల్లిగా తినేది. నా వేళ్ల గురించిన భయం వుండేది కాదు నాకు.

ఓ సారి మా ఆయన తను కూడా అలీస్కని చేత్తో తినిపిస్తానని చెప్పి వో కార్జం ముక్కని పెట్టేరు. అది దయతల్చి తీసుకుంది. తీసుకున్నాక ఆ ముక్కని నేలమీద పెట్టి మెరుపులాగా దూసుకుంటూ గెంతింది. సూచన ప్రాయంగానే వుంది కాని స్పష్టంగా వుంది – నాకు లంచం పెట్టడానికి ప్రయత్నించవద్దు, నీ వేళ్లు జాగ్రత్త అని చెప్తున్నట్టు. తర్వాత హుందాగా కార్జాన్ని తిండం మొదలుపెట్టింది.

యిక మా అమ్మాయికైతే, అలీస్క పేరు చెప్తే గజగజే, అంతకంటే వేరే మాట వాడలేం. కరవాలన్నట్టుగా మా అమ్మాయి కాళ్లమీదకి అది పోయేది. చీపురుకట్ట చేత్తో పట్టుకుని అల్యోనా నవ్వు తెప్పించేటట్టు పెద్ద పెద్ద అంగలతో యిల్లంతా పరిగెత్తేసేది. 'అమ్మోయ్' అని అరుస్తూ నా దగ్గరికి శరణు వేడుతూ వొచ్చేది.

అలీస్కాకి కష్టం కలిగించి, దానికి అయిష్టత కలగడానికి అల్యోనా యేం చేసిందో మరి? యెవరు చెప్పగలరు? పచ్చిక బీళ్లమీద వుండే యీ గుంట నక్క పుట్టు పూర్వోత్తరాలూ వగైరా మాకు యేమీ తెలీదు. బహుశా యే అమ్మాయేనా దాని పట్ల క్రూరంగా వుండిందేమో, మరి అల్యోనా ఆ అమ్మాయిలాగే కనిపించి వుండచ్చు – యెత్తరిగా, ఒత్తుగా వుండే జుట్టుతో.

లేకపోతే అలీస్కాకి వూరికే అల్యోనా బిగ్గర గొంతుక, కుదుపు కదలికలు యిష్టం లేకపోయాయేమో? యెవరికి తెలుసు?

నేనే బహు జాగ్రత్తగా కదలడం మాట్లాడ్డం నేర్చుకున్నాను. అలీస్కా వచ్చిన దగ్గర్నుంచీ నేను నడవడం లేదట జారుతున్నానట, మాట్లాడేటప్పుడు తల చేతులు తిప్పడం కాదట చేతులతో పొడవ బోతున్నానట, మాటలు పలకడం లేదట కూస్తున్నానట... అలా అని మా స్నేహితులు నన్ను వేళాకోళం చేశారు.

పెంపుడు జంతువుని కాకుండా అడివి జంతువుని యెందుకు పెట్టుకున్నావని మా మిత్రులు కొంతమంది నన్ను అడిగేరు. యింతా చేసి నాకు కష్టాలు తప్పడం లేదుగదా!

నేను వూరికే భుజాలు యెగరేశానంతే. యెందుకంటే? యేం చెప్పను! నాకది సంతోషం కలిగించింది కనక అని చెప్పనా? అల్లరి చిల్లరిగా అపనమ్మకంతో వుండే ఆ ప్రాణిని నా ప్రేమ ఆకట్టుకునే కొద్దీ మా మధ్య అవగాహనా, విశ్వాసాల పాశాలు విస్తరించుకోవడం చూసి నాకు సంతోషం కలిగింది.

నేను యింటికి తిరిగి వచ్చినప్పుడు లిఫ్టు తలుపు ధనామని మూసుకునే చప్పుడుకే అలీస్కా చెవులు రిక్కించి, కీచురాయిలాగా చిన్నగా కీచుమని



అరుస్తూ కుక్కలాగా గుమ్మం దగ్గరికి పరిగెత్తుకొస్తుందని తెలిసి నాకు ఆనందం కలిగింది. నేను లోపలికి అడుగు పెట్టినప్పుడు అది నా యిచ్ఛకం కోసం కాకుండా తనంతట తనే పనిమీద వొచ్చినట్టు నటన చేసేది, నిజమే స్వాతిశయం వున్న జంతువు కదా, గుంట నక్క!

కాని దాన్లో నాకు గొప్పగా కనిపించింది అదే — ఆ గర్వం, ఆ అదుపు, ఆ స్వతంత్ర భావన. దానివల్లనే ఆత్మీయతా సూచకమైన ప్రతి చిహ్నం విలువగా వుండేది.

రోజూ సాయంత్రం మానవ చింతల యెడతెగని ప్రవాహం తాకిడికి వేదన పడి, అలిసిపోయి నిరుత్సాహంగా సోఫామీద మునగ లాక్కు పోయి కూర్చున్న నా వొళ్ళోకి హఠాత్తుగా ఆ అడివి జంతువు దూకినప్పుడు నాలో యెంత సంతోషం ఉరకలు వేసిందని చెప్పను!

యిక కొంటె చేష్టలా — సరే, కన్న బిడ్డలు కొంటె చేష్టలు చేసినంత మాత్రాన తల్లులకి పిల్లలమీద ప్రేమ తగ్గుతుందా? ఒకో అప్పుడు పిచ్చి యెక్కించేసేటట్టు ప్రవర్తించినా గానీ?

అలీస్క స్వభావంలో మామూలుగా తిమ్మడి చేష్టలు యెక్కువ. దేన్నో వొక దాన్ని పాడు చేసి తగలెట్టకపోతే దానికి నిద్రపట్టేది కాదు. దేన్నేనా చించెయ్యడమో, పగల గొట్టడమో, కొరకడమో యేదో వొకటి చెయ్యా ల్సిందే. అంచేత మేం యింట్లో లేనప్పుడూ, రాత్రిళ్లప్పుడూ దాన్ని తన "సొంత మకాం"లో, అంటే బాత్ రూమ్‌లోనో, హాల్లోనో బంధించి వుంచేసేవాళ్లం. కాని అది యెప్పుడూ యిలాంటి యేర్పాటుకి వొడ బడేది కాదు. తడవ తడవకీ గది గుమ్మాల కింద గోకేది, కన్నాలు తవ్వేది. వో రోజు పొద్దుట చూస్తే హాలు గోడకి అతికించిన కొయ్యపలక చిలకలు వొక్కొటా

క్కాటే సగం వూడిపోయి వున్నాయి, మాకు మతిపోయింది.

మేం యింటి దగ్గర వున్నప్పుడు అలీస్కాని పిలిచి చేరదీసే వాళ్లం, పిలవకపోతే తనే చక్కా వొచ్చేది. దాంతో చిక్కేమిటంటే అది యెప్పుడూ యెవళ్ళూ దూరడానికి సందులేని మూలకి పోయి అక్కడ తిష్ట వేసేది, ఆ జాగా నంతట్నీ తన భోగంగా అనుభవించేది.

యెప్పుడేనా, యే బీరువా కిందనుంచో దాని బొద్దు తోక పట్టుకుని యివతలికి లాగే కనీవినీ యెరగని స్వాతంత్ర్యాన్ని నాకు ప్రసాదించేది. బెదిరించేటట్టు దగ్గేది, గుర్రుమనేది, కరవ బోయినట్టు విసురు చూపించేది, కాని యింత దౌర్జన్యం చేసినా నన్నెప్పుడూ కరవలేదు.

అది సోఫాలోకి మెలి తిరుగుతూపోయి, స్ప్రింగుల్లోకంటా కలుగు చేసుకుంటే మేమేం చెయ్యాలి? మొదట్లో వాక్యూమ్ క్లీనర్ మామయ్యని శరణు జొచ్చేం. మా రక్షకునికి మేం గౌరవ పురస్సరంగా పెట్టుకున్న పేరది. వాక్యూమ్ క్లీనర్ "గీ" మంటూ స్వరం అలాపన మొదలెట్టగానే అలీస్కా సోఫాలోనుంచి యివతలికి దూసుకువచ్చేసేది. కళ్లు చేటంత చేసుకుని బాత్ రూమ్‌లోకి పరిగెత్తిపోయి దాని పరుపుమీద పడుకునేది. కాని కొంత కాలం తర్వాత అది వాక్యూమ్ క్లీనర్‌కి అలవాటు పడిపోయింది, అదంటే దానికి భయం పోయింది, దానిమీద కోపంగా దగ్గడం మొదలెట్టింది కూడా. ఓ సారి వాక్యూమ్ క్లీనర్ని కరవబోయింది కూడా.

అలీస్కాకి మరో చిత్రమైన అలవాటు వుంది — టెలిఫోన్ తీగల్ని కొరకడం. కాని మాకు అన్నిటికంటే బాధ కలిగించింది యింకోటుంది. యిల్లంతా, మెట్లదాకా కూడా వ్యాపించిన ఘాటైన "జూ" వాసన.

నేను బస్సు యెక్కినా, మెట్రో యెక్కినా జనం యేదో వాసన తగిలినట్టు

వాలకం పెట్టేవారు. మా బట్టలన్నీ అలీస్కా వాసనే. వో సారి మెట్రోలో యెవత్తో విషపుచ్చి ముసల్ది "అబ్బ మేక వాసన. కళ్లకి షోగ్గా రంగు వేసుకున్న యీ ముచ్చటైన మనిషి మేక వాసన కొడుతోంది" అనడం నా చెవిన పడింది. ఆ వాసన పోయే మార్గం లేకపోయింది. యెన్ని డియొడెరంట్లూ దాన్ని యేం చెయ్యలేకపోయాయి.

ఆ రోజుల్లో నేను యెప్పుడూ చేత్తో గుడ్డ పీలికలు పట్టుకుని నేలమీద పాముతూనే వుండేదాన్ని. అప్పుడే బాగా పామిన నేలమీద పళ్లు తోముకునే ద్రావకం ధారాళంగా పోసేసేదాన్ని. యీ ద్రావకాన్ని మందుల షాపులోనే పుష్కలంగా కొన్నాను.

అప్పుడు మా స్నేహితులొకరు భారత దేశంనుంచి వెలలేని కానుకని తెచ్చి యిచ్చారు — అగరు వత్తులు. వీటికి మేం "యాంటీ ఫాక్సిన్" (నక్క వాసనకి విరుగుడు) అని పేరు పెట్టాం. యెవళ్లైనా మా యింటికి వస్తారను కున్నప్పుడు ఒకటో, రెండో సువాసన అగరు వత్తులని వెలిగించే దాన్ని. అవి కాలుతూ వుంటే మత్తెక్కించే చక్కని సువాసన ధూపం గదుల్లో వ్యాపించేది. గదులనిండా నిగూఢ భారత దేశ సుగంధం, దేవాలయాల సుగంధం వ్యాపించేది... అలీస్క వాసనానూ. యే "యాంటీ ఫాక్సినూ" నూటికి నూరుపాళ్లూ 'అలీస్క ప్రూఫ్'గా వుండలేదు.

అదృష్టవశాత్తూ వసంత రుతువు వొచ్చి మా యిక్కట్లని దూరం, చేసింది. మాషా మామ్మ యింటిని పల్లెలో అద్దెకి తీసుకున్నాం. మొత్తం మా జంతుపటాలంతో — అలీస్క, వినీ, పిల్లిలతో సహా, అక్కడికి మారేం. అలీస్కకి కుక్కల దొడ్డి యిచ్చేం. మాంచి భోగంగా వుండే మకాం. విశాలమైన ఆవరణ, చుట్టూతా కంచె.





ఆ యింటికి మర్నాడు అలీస్క వున్న దొడ్లో వినీ అదీ కలిసి సల్లాపంగా ఆడుకుంటూ వుండడం చూసి నాకు ఆశ్చర్యం కలిగింది. రెండు కుక్క పిల్లలు సరదాగా ఆడుకుంటూ దొర్లినట్టు అవి దొర్లుకుంటున్నాయి. నక్కలంటే జన్మతః కుక్కలకి వుండే విరోధం యిదేనా!

వినీలాంటి సాధు స్వభావం, కులాసాగా పోయే తత్వం వున్న ప్రాణిని నా జీవితంలో యెన్నడూ చూడలేదనే చెప్పాలి. మా పల్లెటి మకాంలో అది ప్రతివాళ్లతోనూ స్నేహం చేసుకుందామనే ప్రయత్నించింది. రాత్రిళ్లప్పుడు పక్క అడవుల్లోనుంచి మా యిళ్ల దగ్గరికి వచ్చే ముళ్ల పందులతో సహా. యీ ప్రయత్నాలు ముక్కు రక్తసిక్తమై పోయేటట్టూ, ఆశలు భగ్నమై పోయేటట్టూ విధిగా పరిణమించేవి. అయినా గానీ అది నిరాశ పడేది కాదు, గుర్రుమంటూ తర్వాత వచ్చే ముళ్ల పందేనా తన మంచితనం చూడకపోతుందా అని...

కాని అలీస్క వున్న దొడ్డిలోకి వినీ యెలా వెళ్లింది? యెత్తైన కంచెలో యెక్కడేనా రెండు మీటర్ల ఖాళీ జాగా చేసిందా యేమిటి?

సరె, చూద్దాం యెలా యివతలికి వస్తుందో!

చాలా తేలిగ్గా వచ్చేసింది – అది పిల్లిలాగా పంజాలతో కంచె పట్టుకుని పైకి యెక్కింది. ఆ దృశ్యం చూడ్డానికి ముచ్చటగా వుందని కాదు గాని కనీసం నా కళ్లతో నేను, సామెత చెప్పినట్టు, "కంచెమీద కుక్క"ని చూశాను.

వినీ తన గర్ల్ ఫ్రెండ్‌ని రాత్రిగాని పగలుగాని యెప్పుడేనా వెళ్లి కలుసుకోగలిగేది. ఆ కలయికలు మామూలుగా వొకే మూసపద్ధతిలో వుండేవి. వినీని చూడగానే అలీస్క స్థిమితంగా అదుపులో వుండలేక ఆవరణ అంతా ఉరుకు లెత్తేసేది. వినీ నేలమీదకి అలీస్క రాజ్యంలోకి తపామని

దూకే దాకా అలానే వుండేది. తర్వాత వినీ దాన్ని తరమడం మొదలుపెట్టేది. దాని తోకని పట్టుకుందామని దురాశాపూరిత స్వప్నం వినీకి పురిపెట్టేది. యీ తరమడాలూ, తరిమించుకోవడాలూ తారస్థాయికి చేరుకునేవి – ఉత్తే జంతో. మధ్యమధ్యలో అలీస్క టక్కన పక్కకి మళ్లిపోయేది. దాంతో వినీకి బ్రేకు వేసుకునే వ్యవధి లేక తిన్నగా కంచెలోకి దూసుకుపోయేది.

యీ పెనుగులాట చప్పుడుకి ఆకర్షితురాలై యెప్పుడేనా పుస్సీ అక్కడికి వచ్చేది. అది ఆవరణ కంచె నాలుగు గుంజల్లోనూ వొక దానిమీద యెక్కి కూర్చుని బురుజుమీద కూర్చున్న కాపలా జవానులా, పెద్ద పసుప్పచ్చ కళ్లని యీ "యోధుల" మీదనే లగ్నం చేసి చూస్తూ వుండేది. అది అలీస్క పక్షాన్నే వున్నట్టు స్పష్టంగా తెలుస్తూ వుండేది. రక్తపిపాసి కుక్క నోట్లో ఆ నక్క పడి పోతుందేమోనని వూహించుకుని విపరీతంగా ఆందోళన పడిపోయేది. అలాంటి క్షణాల్లో వీపుని విల్లులా బాగా వంచేసేది. దాని బొచ్చు నిగిడేది. గొంతు చించుకుని 'మ్యో'మని కూసేది, వినీమీదకి వురికెయ్యాలని తయారవుతూ. చాలా సార్లు దాన్ని సరిగ్గా అలాంటి వూపులో వున్నప్పుడు అక్కణ్ణుంచి దింపేశాను.

అలీస్క, వినీ వొకే కంచంలో తినేవి. ఆ ఆవరణకి అలీస్కయే యజమానురాలవడంతో యెప్పుడూ వినీ మొదట దాన్నే తిననిచ్చేది. వినీ పక్కన బొమికెలు నాకుతూ తన గర్ల్ ఫ్రెండ్ కడుపునిండా తినేదాకా మర్యాదగా నుంచునేది. కాని యీ గర్ల్ ఫ్రెండ్‌కి ఆశ యెక్కువ. అంతా తినలేనేమో అనే వూహ దానికి వెర్రెక్కించేసేది. ఆబగా మెక్కేసేది, దాంతో దానికి పొలమారేది. నమలకుండానే పెద్ద పెద్ద ముక్కల్ని గుటుక్కున మింగేది. దానికి యెక్కడ అడ్డంపడి పొలమారుతుందోనని నా

భయం. యిక కడుపు పట్టదు అనిపిస్తే కంచంలోనుంచి పెద్ద ముక్కని లాక్కుని, పళ్లతో కరుచుకుని దూసుకు పోయేది. స్నేహం స్నేహమే, వంగతోటలో బావ కాదు కదా.

దరిమిలా తన నిధిని పూడ్చి పెట్టుకునేది. తర్వాత వెర్రెత్తి పోయి, దాన్ని తవ్వి తీసి మళ్లీ పరుగులు పెట్టేది.

వినీ దాని క్రీడల్ని తొణక్కుండా, బెణక్కుండా చూస్తూ వుండేది. తర్వాత అంతే స్థిమితంగా అది దాచేసిన తిండి తను తినేది.

యీ గుంటనక్క, కుక్క కవల పిల్లల్లా వుండేవి. దానికి అంత మంచి నేస్తం దొరికినందుకు మేము సంతోషించాం. కాని వో సారి కుక్క పిల్ల కుంయ్‌మన్నట్టుగా యేడుపు వినిపించింది. యేమిటీ మొరపెట్టుకుంటోంది అది?

తీరా చూద్దునుకదా అలీస్క. ఆట మంచి పసందుగా వున్న దశలో వినీ దాన్ని వదిలి పెట్టేసింది. అలీస్క తనని వదిలిపెట్టి వెళ్లిపోయిన నేస్తం వెనక్కాలే కంచెమీదకి యెగబాకడానికి ప్రయత్నిస్తోంది. కాని జారిపోతోంది, మళ్లీ యెక్కబోతోంది, మళ్లీ జారిపోతోంది....

యీ యేడ్పులు నాకు యింకా యింకా యెక్కువగా చెవిని పడేవి. అలీస్క ఆవరణ కంచె మీదనుంచి గెంతడం తెలిసాక వినీ మా తోటకి వున్న కంచెమీదనుంచి గెంతడం నేర్చుకుంది. దాన్ని యింటి దగ్గర వుంచడం వీలవదు, దాని ఆడ నేస్తాం కుక్కలన్నీ వూరంతా తిరుగుతూ వుంటే, వాటి అభిమానులైన కుక్కలు వెంట పడుతూ వుంటే వీలవుతుందా. గోలగోలగా కుక్కల అరుపులు తడవ తడవకీ మోతెత్తి పోయేవి, కుక్కల కొట్లాట లేచినప్పుడల్లా యీ గోల తప్పేది కాదు.

ఒకో సారి వినీ వరసగా మూడేసి రోజులు పత్తా వుండేది కాదు. తర్వాత పీక్కుపోయి, దీనంగా, గాట్లతో తిరిగివచ్చేది.

తిరిగివచ్చినప్పుడు వినీ గేటు దగ్గర్నుంచి తన దొడ్డి దాకా పొట్టమీద పాక్కుంటూ వెళ్లేది. మళ్లీ కొన్ని రోజులు యెక్కడికీ కదలకుండా యింటి దగ్గరే శరీరానికీ మనసుకీ తగిలిన గాయాలనుంచి కోలుకొంటూ వుండేది. తర్వాత మళ్లీ చెక్కేసేది. అలీస్క పూర్వంలాగా హుషారుగా వుండడమే లేదు. కళ తగ్గిపోయింది, మూతి ముడుచుకుని వుండేది.

అప్పుడు వో రోజున వో సాహస యాత్ర చేసి వినీ మళ్లీ అలీస్క ఆవరణలో ప్రత్యక్షమైంది. అలీస్క వెర్రి ఆనందంతో ఉరకలు వేస్తుందని మేమనుకున్నాం. కాని అలీస్క ముఖం ముడుచుకునే వుండిపోయింది. సరదాగా గెంతులు వేద్దామని యెన్ని చిట్కాలు చేసినా లాభం లేకపోయింది. అలీస్క వినీని యేం పట్టనట్టుగా చూసి పెద్దగా ఆవలించి వెనక్కి తిరిగి తన మకాంలోకి వెళ్లిపోయింది.

పొద్దున్నే నేను అలీస్కకి అన్నం కంచం పట్టికెళ్లాను.

నన్ను చూడగానే అలీస్క ఆవరణలో వెనక్కీ ముందుకీ పరుగులు తియ్యడం మొదలుపెట్టింది. నాస్తా కోసం ఆతృతగా వుంది. ఆకలేస్తోంది కామోసు. నేను లోపలికి వెళ్లగానే అది సరదా ఆటలు ఆడే కుక్కలాగా నా చుట్టూ గంతులు వేసింది. నా గొను గుంజింది, వుండబట్టలేక.

నేను ఆవరణ తుడిచి శుభ్రం చెయ్యడానికి దిగగానే అలీస్క తనకి చేతనైనంతగా నాకు అడ్డం పడేది — ఆట క్రొరుని కొరకడం, నక్క యెలకల్ని వేటాడినప్పుడు చేసినట్టుగా నా కాళ్లమీదకి యెగరడం చేసేది.

వాతావరణం బాగుంటే గనక నేను లోపలికి తేలికైన మడత బల్లని

తెచ్చే దాన్ని. దాని కాళ్లమీద అలీస్కా కొరికిన గుర్తులు వుండేవి. అలాంటిదే మడత కుర్చీని కూడా తెచ్చుకునే దాన్ని, కూచుని పని చేసుకోవచ్చని.

అలీస్కాతో ప్రతి గంట, ప్రతి క్షణం సంబంధం వుంచుకోవాలనీ, దానికి దగ్గరగా వుండాలని ఆతృతగా వుండేది నాకు. ఆ ఆవరణ లోపలే పని చేసుకోవాలని నాకు అనిపించేది. చిత్రం! రోజువారీ యాతనలనుంచీ ఆందోళనలనుంచీ కంచె నన్ను కాపాడుతూ వున్నట్టుండేది.

'నన్ను చూడు' అన్నట్టుగా అలీస్కా త్వరపెట్టేది. టేబిల్ కోళ్లమీద గట్టిగా దాడి చేసేది. తర్వాత నా కాళ్లమీద దాడి చేసేది. అయినా నా యేకాగ్రత పిసరు కూడా తప్పేది కాదు. దానితో పరధ్యానంగానే ఆడుకునే దాన్ని, నా లోపలి యేకాగ్రత చెడిపేది కాదు. వొక ప్రాణిని సకల అనర్థాలనుంచీ కాపాడడం నా చేతిలో వుంది. అలాంటి ప్రాణి వొకటి యీ ప్రపంచంలో నా బాధ్యతలో వుందన్న భావం నాకు ఆనందంగా వుంది.

(అప్పట్లో నేనలానే అనుకున్నాను. ప్రకృతి నియమం, యాదృచ్ఛికత అనివార్యంగా కలిసిపోయి మనం విధి అని పిలిచే దాన్నుంచి యెవళ్లనేనా కాపాడ్డం సాధ్యమైనట్టు).

ఒకోఅప్పుడు నేను అలీస్కాని అడివిలోకి షికారు తీసికెళ్లేదాన్ని. దాన్ని చేతుల్లో చిన్న పిల్లని తీసికెళ్లినట్టు యెత్తుకెళ్లేదాన్ని. మెళ్లో తాడు కట్టి నడిపిస్తే నడవడం దానికి యెంతకీ చాతకాలేదు. అలీస్కాకి ఆ షికార్లు సరదాగా వుండేవి. కోతిలాగా అన్నిటినీ గుచ్చిగుచ్చి చూసేది. మరి అడివిలో అలా చూడ్డానికి విశేషాలు బోలెడున్నాయి కదా.

ఓ సారి వో సంఘటన జరిగింది. దాంతో అలీస్కా పట్ల నాకు బ్రహ్మాండమైన గౌరవం కలిగింది.

యధా ప్రకారం మేం షికారుకి వెళ్ళాం. ఆకురాలు కాలంలో పొడిగా యెండగా వుండే వొక రోజు. ఆవేళ ఆకాశం ప్రశాంతంగా, కొంచెం దిగులుగా వుంది. మధ్యాహ్నం పూట. విశ్రాంతిగా వేసవి కాలం గడపడానికి వచ్చిన వాళ్ళంతా వెళ్ళిపోయారు. వాళ్ల ట్రాన్సిస్టర్ గోల సద్దు మణగడంతో అడివి నిద్రపోతోంది. యెక్కడా వొంపులు, మలుపులు లేని నిబ్బరమైన దారిలో వెడుతున్నాను. బర్చ్ చెట్ల కాండాలు స్వచ్ఛంగా వున్నాయి. యెండ బాగా కాస్తోంది. చీమ చిటుక్కుమంటే వినిపించేటంత నిశ్శబ్దంగా వుంది. వున్నట్టుండి వో ఆడమనిషి కెవ్వు మనడం వినిపించింది. నేను గిరుక్కున అటు చూసేను. లేగదూడలావున్న తెల్లటి బొచ్చు కుక్క వొకటి, మా వెనకాలే కిమ్మనకుండా లగెత్తుకుని మేం వున్న దారిలో వస్తోంది. అది పైరేట్ కుక్క, దక్షిణ రష్యా వేట కుక్కల జాతిలో భయంకరంగా వుండే రకం కుక్క.

పైరేట్ కాపలా కాసే తోట దరిదాపులకి అక్కడుండే కుర్రాళ్లెవళ్ళూ పోరు, పెద్దవాళ్ళూ వెళ్లరు. దొంగచాటుగా వేరే వాళ్ల చెట్ల యాపిల్స్ కోసుకోవాలనే కోరిక పెద్దవాళ్లకేం వుండదు కదా. అయినా వాళ్ళు కూడా కంచె వారే జాగ్రత్తగా చూసుకుంటూ వెళ్లేవాళ్ళు. కంచె వెనక్కాల పసుప్పచ్చ కోరలని ఉగ్రంగా బయటికి పెట్టి అటూ యిటూ దూసుకుపోతూ వుండేదా బొచ్చు కుక్క.

యిప్పుడదే కుక్క నిరాఘాటంగా మా మీదకి వొచ్చేస్తోంది. యెత్తు మడమల బూట్లు తొడుక్కున్న లావాటి ఆవిడ యెవరో అరుస్తూ కుక్క మెడకి కట్టే పట్టే వూపుతూ దాని వెనక్కాల కొంచెం దూరంలో వస్తోంది. కుక్క ఆవిడని పట్టించుకోలేదు, క్రూరమైన నిశ్శబ్దాన్ని భంగించకుండా

వస్తూనే వుంది. కుక్క మా గుండెలవిసి పోయేటట్టు యింకా యింకా దగ్గరగా వచ్చేస్తోంది. పరిగెత్తి ప్రయోజనమూ లేదు – నిజానికి అది మరీ ప్రమాదకరం. వున్న చోటనే వుండిపోయి, యజమానురాలు గొలుసు పట్టుకు వచ్చే దాకా, పైరేట్‌తో మాట కదలేసి దాని దృష్టి మళ్లించడమే మెరుగు. భయపడి పోతున్నట్టు కనిపించకూడదు, అదీ ముఖ్య విషయం.

కాని అలీస్కకి తప్పించుకుపోయే వ్యవధి యింకా వుంది. దీన్ని పైరేట్‌కి నైవేద్యం పెట్టడమా! వెంటనే దీన్ని వదిలెయ్యాలి – వొక వేళ నాకది యిక యెన్నటికీ కనిపించకపోయినా కూడా... అలీస్కని నేల మీదకి దింపేను. అది పొదల్లోకి జారిపోయింది. యిక బుజ్జగించినా రాదు.

కుక్క దాన్ని చూళ్లేదో లేకపోతే నేనే దానికంటే మంచి వేట అను కుందో తెలీదు మరి, నాకేసే మొరగకుండా వచ్చేస్తోంది. అది మీద పడ డంలో యిదే భయంకరమైన సంగతి. నేను లావాటి బర్చ్ చెట్టుకి తాసుకు పోయాను. కుక్కకీ నాకూ మధ్య రెండు మీటర్ల దూరం కూడా లేదు. "పైరేట్, మా అమ్మవు కదూ" అని నేను దేవురించే టట్టు తియ్యగా బతిమాలుకున్నట్టుండే గొంతుకతో అన్నాను. "వూఁ... నన్ను కరవకేం..."

వచ్చే వచ్చే కుక్క ఆగిపోయింది. దాని బిత్తరపాటు చూసి నేను యింకా నిబ్బరంగా అన్నాను: "నువ్వు, యెంత ముచ్చటైన దానివో, తెలివైన దానివో, మంచి కుక్కవో..."

ఆ క్షణంలో పైరేట్ యెగరడానికి వూపుతో వుండడం కనిపించింది. నా మెడ పట్టుకోవాలని దానికి వుండచ్చు. మొదటి సారి బాగా యెత్తు యెగరలేదు. రెండో సారి యెలా తప్పించుకున్నానో నాకే తెలీదు.

యజమానురాలు కళవిళ పడిపోయి వస్తూ వుండడం కనుకొలకు ల్లోంచి చూస్తూ పైరేట్ మూడో గెంతు గెంతుతుందని చూస్తున్నాను. భయంతో ఆమెకి అనుకోని బలం వచ్చి వుండచ్చునేమోగాని ఆ బొద్దు మనిషి యీ క్రూరమైన కుక్కని అదుపు చెయ్యగలదా? మూడో సారి గెంత డానికి తయారవుతూ నేలమీద కూర్చున్న పైరేట్ వున్నట్టుండి మొయ్యోమని అరిచింది. నా కళ్లని నేను నమ్మలేకపోయాను. మా చిన్న ధైర్యవంతమైన అలీస్కా బుల్‌డాగ్‌లాగా పైరేట్ వెనక్కాల కాలిని గట్టిగా కరిచింది...

పైరేట్ మెరుపు తీగలాంటి విసురుతో మూతి యెగరేసింది కాని దాని కోరలు గాలిలో లటక్కన కరుచుకున్నాయంతే. అలీస్కా అప్పటికే దౌడు తీసుకుపోతోంది. దాని బొచ్చు తోక యెత్తుగా వుంది. తోకని యెత్త గానే దాని పొడవు సగం తగ్గిపోయింది, దాంతో దాన్ని పట్టుకోవడం మరింత కష్టం అయింది. పైరేట్ నన్ను గురించి పొంతం మర్చిపోయింది. అలీస్కా వెనక్కాల దౌడు తీసింది.

నేను అమ్మయ్య అని వూపిరి పీల్చుకున్నాను. అడ్డదారమ్మట పడి యిల్లు చేరుకున్నాను. ఆ కుక్క బారినుంచి అలీస్కా తప్పించుకో లేదన్న అనుమానం నాకు లేదు. కాని యింటికి రాగలదా అని?

నేను దాని దొడ్డి దగ్గరికి పరిగెత్తి వెళ్లి చూసేను, అలీస్కా హాయిగా కప్పమీద పడుకుని వుంది. ఆయాసంతో యెగిసి పడే డొక్కలవల్ల అది పరిగెత్తుకుంటూ వచ్చిందని తెలుస్తుందంతే. లేకపోతే మొత్తం వాలకం, అలసంగా ఆ పడుకోవడం, కళ్లు సగం మూసుకోవడం "యేమిటి సంగతి? ఆత్మ గౌరవం వున్న యే నక్కైనా చేసేటట్టే చేసానంతే. మా పచ్చిక బీళ్లల్లోనూ, యెడారుల్లోనూ కష్టాల్లో వున్న మిత్రుల్ని మేం వాళ్ల

ఖర్మానికి వొదిలెయ్యం'' అంటున్నట్టు వుంది.

అక్టోబరు నెల వచ్చింది. వాన కుండ పోతగా మొత్తేస్తూ వుంది. కాని అలీస్కాని యేం చెయ్యాలా అని తేల్చుకోలేక మేం యింకా పల్లెటూళ్లోనే వున్నాం. వొకటి మాత్రం ఖాయంగా తేలింది దాన్ని పట్నవాసం కొంపలో వుంచుకోవడం అసాధ్యం. కడకి సమస్య దానంతటదే పరిష్కారం అయింది.

అక్టోబరు నెలాఖర్లో మేం కార్యాంతరంమీద వేరే చోటకి వెళ్లాల్సి వచ్చింది. యెంతో మీమాంస పడి ఆఖరికి మా జంతువుల్ని మా యింటావిడ మాషా మామ్మ దయా దాక్షిణ్యాలకి వదిలిపెట్టి వెళ్లాం. ఆ ముసలావిడ అలీస్కాని వదిలేసింది, ''పనికి మాలిన'' జంతువుతో యెవళ్లేనా యెందుకు వేగుతారో అర్థం చేసుకోలేక.

మూడు వారాల తర్వాత తిరిగివచ్చి చూద్దును కదా అలీస్కా వుండే మకాం ఖాళీగా వుంది. నేను గబగబా మాషా మామ్మ దగ్గరికి పరిగెత్తేను. ఆవిడ సంతోషంగా స్వగతంగా అంది. ''పారిపోయింది, ఆ నక్క! మీరు వెళ్లిన రెండు రోజులకి. మీరు చెప్పినట్టే కంచం పట్టుకుని పొద్దునే వెళ్లాను, అది యెగురుకుంటూ వస్తుందనీ నన్ను చూసి దగ్గుతుందనీ నేననుకున్నాను. మెప్పుగా అది నాకిచ్చే ప్రతిఫలం ఆ దగ్గు! కాని అది యెగురుకుంటూ రాలేదు. తలుపు చూస్తే వోరగా తీసి వుంది. రాత్రి గడియ వెయ్యడం మర్చిపోయానేమో మరి! జిత్తులమారి నక్క కదా!... అరె! అదేమిటి, యేడుస్తున్నారు? పారిపోయింది పీడావిరగడై పోయిందని సంతోషించక! దాన్తో యెంత యాతన పడ్డారు కారు మీరు!'' అంది.

అలీస్కా పారిపోయి యిరవై రోజులు దాటిపోయింది. యే ప్రమాదం జరక్కుండా వుంటే తప్పకుండా ఒక్కసారేనా వస్తుందనే నాకు నమ్మకం.

బహుశా అలీస్కా మొదటి స్వేచ్ఛా దినమే ఆఖరిదీ అయిందేమో. కుక్కలు గాని, వేటగాళ్లు గాని దాన్ని వదలరు. తను హఠాత్తుగా దూకిన ఆ ప్రపంచాన్ని మరీ అమాయకంగా నమ్ముతుందీ ప్రాణి. యేమైనా తిండి యెలా సంపాదించుకోవాలో పాపం దానికి తెలియనుకాక తెలీదు...

యేమిటో వెర్రి భ్రమ కొద్దీ నేను దాని దొడ్డి కప్పుమీద వో మాంసం ముక్క పెట్టాను. అది పొద్దుటి దాకా అలానే వుంది. మర్నాడు పొద్దుటికి అది లేదు. కాని ఆ పక్కనే మట్టిలో పిల్లి అడుగు జాడలు కనిపించాయి.

మేం మళ్లీ మా బస్తీకి వెళ్లిపోయాం.

పోనీ యెందుకేనా మంచిదని, మాషా మామ్మని అలీస్కా యింటి మీద కాస్త తిండి పడేస్తూ వుండమని చెప్పాను. కాని ఆ ముసలావిడ నా కోరికని మన్నించి వుంటే, వేసవి వినోద యాత్రీకులు వదిలేసిన యే దిక్కుమాలిన పిల్లికో అది లాభించి వుండేది.

నన్ను యేదో పనిమీద మా అధికార్లు వెళ్లమంటే వెంటనే వెళ్లాను. తిరిగివచ్చేక ఆ శీతకట్టు అంతా వూరు వదిలి వెళ్లలేదు. మార్చి నెలలోనే మాషా మామ్మ దగ్గరికి వెళ్లగలిగాను.

వసంత రుతువు. శోభాయమానంగా వున్న రోజు. నా జ్ఞాపకాలకి పదును తగ్గింది. అన్ని స్మృతులూ కడకి కాలంతో మాసిపోతాయి... ఆ దొడ్డిలో వున్న గూటి దగ్గరికి వెళ్లకుండా చూసుకున్నానంతే.

ఆ రాత్రి నాకు అలీస్కా కలలోకి వచ్చింది. దాని గొంతు వినిపించి మెలుకువ వచ్చింది. కీచురాయిలాగా 'గీ'మని సంతోషభరిత ఆశ్చర్యాన్ని వెల్లడి చేసే గొంతు. దీపం వేశాను. కాసేపు చదువుకుని మళ్లీ పడుకున్నాను. ఉదయం మళ్లీ మంచుమీద పరిగెత్తిన జాడలు నా

మంచం వున్న గది కిటికీ దాకా రావడం కనిపించింది. నా గుండె వో క్షణం ఆగిపోయింది. అయిదు వేళ్ళు పడ్డ జాడలు, అలీస్క్కావి లాగే వున్నాయి.

ఆ గుంటనక్క బతికే వుందా? యే అస్పష్టమైన స్మృతులో దాన్ని సరిగ్గా నేను వున్న ఆ రాత్రే మాష మామ్మ యింటికి తీసుకు వచ్చేయా?

లేక వేరే జంతువువేమో ఆ జాడలు. యింతా చేసి అడివి పక్కనే వుంది కదా. నాకీ వూహే నచ్చింది, నిజానికి. లేకపోతే అంతులేని వొంటరితనంతో చుట్టు పక్కలనే తచ్చాడుతూ వుండే జంతువుని గురించి వూహించుకుంటే భయంకరంగా వుంటుంది. నాకు తప్ప యెవళ్ళకీ అక్కర్లేని జంతువు, నేను స్నేహం చేసుకోవడంవల్ల నా బాధ్యత కిందికి వచ్చి, నేను కాపాడలేక పోయిన జంతువు వొంటరిగా వుండిపోయిందనే వూహ భయంకరంగా వుంటుంది.

అలీస్క... యెక్కడినుంచి వచ్చిందో యేమో యెవళ్ళకీ తెలీదు, యెక్కడికి పోయిందో కూడా యెవళ్ళకీ తెలీదు. మార్చి నెలలో ఆ రాత్రి చిత చితలాడే మంచులో పడిన జాడలు దేనివో యేమిటో నాకెన్నటికీ తెలీదు...

పాఠకులకు మనవి

ఈ పుస్తకం గురించీ, దీని అనువాదం గురించీ మీ అభిప్రాయాలను "రాదుగ" ప్రచురణాలయానికి దయచేసి తెలుపండి మీ అభిప్రాయాలను ఈకింది చిరునామాకు పంపండి:

Raduga Publishers
17, Zubovsky Boulevard
Moscow, USSR